# హరహర మహాదేవ

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ఘనంగా శివపార్వతుల కల్యాణం
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా బుధవారం శివాలయాల్లో శివరాత్రి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పలు ఆలయాల వద్ద అన్నదానం చేశారు. రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్


మహబూబాబాద్ రూరల్: బ్రహ్మకుమారీస్ సెంటర్‌లో శివలింగానికి క్షీరాభిషేకం


మహబూబాబాద్ రూరల్: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


డోర్నకల్ శివాలయంలో పూజలు


దంతాలపల్లి: రేపోణి గ్రామంలో సాధువుల వేషధారణలో శివస్వాములు


కొత్తగూడ: బోనాలతో శివాలయానికి వస్తున్న భక్తులు


తొర్రూరు రూరల్: మదూరు శివాలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు


గూడూరు: శివాలయంలో క్యూలో భక్తులు


చిన్నగూడూరు శివాలయంలో..


దంతాలపల్లి: రేపోణి గ్రామంలో అలంకరణలో శివుడు


మరిపెడ శివాలయంలో..


గార్ల: మండలం రాజ్యాతండాలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


నెల్లికుదురు: మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో..


మరిపెడ రూరల్: అగస్త్వేశ్వర ఆలయంలో..


నర్సింహులపేట శివాలయంలో..


గంగారం: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


తొర్రూరు: పాటిమీది ఆలయంలో..


బయ్యారంలో అన్నదానం..


మహబూబాబాద్ రూరల్‌లో..


మహబూబాబాద్ రూరల్: పూజలు చేస్తున్న భక్తులు


కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో..

## క్లుప్తంగా

### అమరుల త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణ

నెహ్రూసెంటర్: అమరవీరుల పోరాట త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్యమాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అశువులు బాసిన కుటుంబాలకు పరిహారం చెల్లించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కుక్కల సుధారాణి, ధర్మారపు ఎలేందర్, బాలకృష్ణ, సతీష్, జయరాజు పాల్గొన్నారు.

### స్కావెంజర్ల వేతనాలు చెల్లించాలి

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత కోసం నియమించిన స్కావెంజర్ల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ స్కావెంజర్ల సంఘం జిల్లా కన్వీనర్ ఇస్సంపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న స్కావెంజర్లకు 6నెలలు దాటినా వేతనాలు అందించకపోవడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో అశోక్, చంద్రయ్య, రవి, వెంకన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

### కంఠమహేశ్వరుడికి బోనాలు



గార్ల: మహాశివరాత్రి పండును పురస్కరించుకొని గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కంఠమహేశ్వరస్వామికి బుధవారం గార్ల పట్టణ గౌడసంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనుగౌడ్, కృష్ణగౌడ్, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

### అదనపు కలెక్టర్‌కు సన్మానం



మహబూబాబాద్ రూరల్: మహాశివరాత్రి పర్వదినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సెంటర్‌లో ప్రత్యేకంగా బ్రహ్మకుమారీ సుజాత ఆధ్వర్యంలో బుధవారం శివలింగ క్షీరాభిషేకం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి హాజరై శివలింగ దర్శనం చేసుకుని క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి లక్ష్మీనారాయణుల చిత్రపటాన్ని బహూకరించారు.

### ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం



చిన్నగూడూరు: మహబూబాబాద్ మండలంలోని శనిగపురం గ్రామానికి చెందిన వెంకట శివప్రసాద్ బుధవారం చిన్నగూడూరు మండల కేంద్రంలోని గంగమ్మ తల్లిని దర్శించుకుని, ఆలయ నిర్మాణానికి రూ.2లక్షలు విరాళంగా యాదవ సంఘం కమిటీ నిర్వాహకులకు అందజేశాడు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు చిత్తారి వీరన్న, కొమ్ము నర్సయ్య, మురారి సురేష్ పాల్గొన్నారు.

### కలకలం రేపిన పసిబిడ్డ విక్రయం..!

కేసముద్రం: గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా నవజాత శిశువులను తరలించి, అక్కడి నుంచి పిల్లలు లేని దంపతులకు డబ్బులకు విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను మంగళవారం రాచకొండ పోలీసులు పట్టుకుని, అరెస్టు చేశారు. ఈ కేసులో కేసముద్రంకు చెందిన ఓ వ్యక్తి పసిబిడ్డను కొనుగోలు చేసినట్లు బుధవారం పలు పత్రికల్లో కథనం ప్రచురితమైంది. దీంతో ఈ విషయం స్థానికంగా కలకలం రేపింది.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బయ్యారం: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి బయ్యారం–గార్ల మండలాల సరిహద్దులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన కత్తి జంపయ్య (48) గార్ల మండలం సీతంపేటకు స్కూటీపై వెళ్లి వస్తున్న సమయంలో తీవ్రగాయాలతో మహబూబాబాద్ ఆస్పత్రికి 108లో తరలించగా మృతి చెందాడు. కాగా కొందరు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారని పేర్కొంటుండగా.. మరి కొందరు జంపయ్య మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ‘ఆగ్రోస్’ ద్వారానే నాణ్యమైన ఎరువులు

- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్: ప్రభుత్వ ఆధీనంలో నడిచే రైతు ఆగ్రోస్ సేవా కేంద్రం ద్వారానే రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు లభిస్తాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. మండలంలోని తానంచర్ల గ్రామంలో తేజావత్ భరత్‌కుమార్, తేజావత్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతు ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పాజిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, నూకల అభినవ్ రెడ్డి, పురుషోత్తమరెడ్డి, మాజీ సర్పంచులు రాంలాల్, జగినిలాలు, అంబరీష, గుగులోతు రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.


ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

## ట్రాలీ కిస్తీలు కట్టడంలో ఇబ్బందులు

- భార్యాభర్తల మధ్య గొడవ
- మనస్తాపంతో భర్త ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి

గూడూరు: బతుకుదెరువు కోసం టాటా ఏస్ ట్రాలీ కొనుగోలు చేశాడు. ఇందుకోసం రూ.5.50లక్షలు ఫైనాన్స్ తీసుకొని కిస్తీలు కడుతున్నాడు. ఈక్రమంలో కిస్తీలు కట్టడం ఇబ్బంది కావడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరగగా.. భర్త మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. ఈమేరకు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని కొల్లాపురం గ్రామంలో జరిగింది. ఎస్సై గిరిధర్ తెలిపిన వివరాల ప్రకారం .. కొల్లాపురం గ్రామానికి చెందిన పిట్టల వీరన్న (40) చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో టాటాఏస్ ట్రాలీ ఫైనాన్స్‌లో కొనుగోలు చేశాడు. ట్రాలీ కిస్తీలు కట్టడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన వీరన్న బుధవారం ఉదయం వ్యవసాయ బావివద్ద పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

## గొర్రెను రక్షించబోయి..

- విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి
- షాపు ఎదుట మృతదేహంతో ధర్నా

కురవి: గొర్రెను రక్షించబోయి గొర్రెలకాపరి పాశం మల్లయ్య(55) విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన మండలంలోని రాజోలు గ్రామంలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజోలుకు చెందిన పాశం మల్లయ్య అనే గొర్రెల కాపరి తన గొర్రెలు, మేకలను మేత కోసం తీసుకెళ్లాడు. సాయంత్రం సమయంలో అదే గ్రామానికి చెందిన కలకోట రాము అనే వ్యక్తికి చెందిన సూపర్ మార్కెట్ వెనుక భాగంలో ఉన్న ఎర్త్ వైరుకు గొర్రె తగిలి గిలగిలా కొట్టుకుంటుంది. గొర్రెను రక్షించేందుకు దానిని పట్టుకుని లాగే ప్రయత్నం చేశాడు. దీంతో మల్లయ్యకు విద్యుత్‌షాక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కలకోట రాము తన షాపులకు సంబంధించిన ఎర్త్‌వైరును అజాగ్రత్తగా పెట్టి ఉంచడంతోనే మల్లయ్య మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ మృతదేహంతో షాపు ఎదుట ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న కురవి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడికి భార్య వినోద, కుమార్తె, కుమారుడు ఉన్నారు.


మల్లయ్య (ఫైల్)

### షార్ట్ సర్క్యూట్‌తో యువకుడి మృతి

కురవి: షార్ట్ సర్క్యూట్‌తో యువకుడు బానోత్ పవన్(19) మృతి చెందిన సంఘటన బుధవారం సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యా నాయక్ తండా గ్రామం పరిధిలోని తునికిచెట్టు తండాలో చోటు చేసుకుంది. వివరాలు.. తునికిచెట్టు తండాకు చెందిన బానోత్ శ్రీను కుమారుడు పవన్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వ్యవసాయ బావి వద్ద ఉన్న విద్యుత్ వైర్లను సరిచేస్తుండగా విద్యుత్‌షాక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలియగానే సీరోలు ఎస్సై నగేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించాడు. విషయమై ఫిర్యాదు అందలేదని ఎస్సై నగేష్ తెలిపారు.

### వదినపై కొడవలితో దాడి..

- ఇంటిస్థల వివాదంలో ఘటన

కేసముద్రం: ఇంటిస్థల వివాదంలో వదినపై, మరిది కొడవలితో పలుచోట్ల దాడిచేసి గాయపర్చిన సంఘటన ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామశివారు మూలస్తంభం తండాలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నూనావత్ రాజీ, తన మరిది నూనావత్ రమేష్‌కు మధ్య ఇంటిస్థలం విషయంలో వివాదం జరుగుతుంది. ఈక్రమంలో ఇట్టి పంచాయితీ పెద్దమనుషుల మధ్య నడుస్తుంది. ఇదిలా ఉండగా రాజీ తన ఇంటి నిర్మాణంలో భాగంగా పునాది పనులు నిర్వహిస్తుండగా, ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో రాజీ తన చేతిలో ఉన్న పారతో కొట్టబోగా, రమేష్ తన వద్దనున్న కొడవలితో ఆమె తలపై, భుజం మీద, వీపుపై, చేతిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. దీంతో తీవ్రగాయాలతో స్పృహ తప్పి కిందపడిపోయిన ఆమెను 108లో మానుకోట ఆస్పత్రికి తరలించారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.


గాయపడిన రాజీ

### నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు

బయ్యారం: మండలంలోని పలు బేకరీల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారని వీటిపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశాడు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

### జామాయిల్ తోట దగ్ధం



డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో బుదవారం ప్రమాదవశాత్తు జామాయిల్ తోట దగ్ధమైంది. గొల్లచర్ల–చిలుకోడు మార్గంలో గొల్లచర్లకు చెందిన వై.సాయిబాబుకు చెందిన జామాయిల్ తోటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని చెట్లు మంటల్లో దగ్ధమయ్యాయి. మహబూబాబాద్ నుంచి ఫైరింజన్ ఘటనాస్థలానికి చేరుకొని సిబ్బంది మంటలు ఆర్పారు. ప్రమాదంలో సుమారు రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని వై.సాయిబాబు తెలిపారు.

## ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

- మాజీ మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని చిన్నవంగర గ్రామంలో మల్లికార్జున దేవస్థానంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దయాకర్‌రావు పాల్గొని శివలింగానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాకతీయుల కాలంలో వెలసిన ఈ ఆలయంలో స్వామికి అభిషేకం చేస్తే మంచి జరుగుతుందని పేర్కొన్నారు. ఆలయం కొన్నాళ్ల క్రితం శిథిలావస్థకు చేరగా దాతలు సాకారంతో పునరుద్ధణ చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాకనాటి లక్ష్మారెడ్డి, అజిత్‌రెడ్డి, ఎన్ఆర్ఐ సునీల్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, కొండపల్లి విజయ్‌పాల్ రెడ్డి, మెట్టు నగేష్ సౌజన్య పాల్గొన్నారు.


అలయం వద్ద భక్తులతో దయాకర్‌రావు

## ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి


మాట్లాడుతున్న బిల్లకంటి సూర్యం

నెహ్రూసెంటర్: దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రభుత్వాలు చొరవ తీసుకుని కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి బిల్లకంటి సూర్యం అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన ఢిల్లీలో జరగనున్న జాతీయ సదస్సును జయప్రదం చేయాలని బుధవారం జిల్లా కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా రోజురోజుకు పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెంపుతో సామాన్య ప్రజలు జీవన ప్రమాణాలను కోల్పోతున్నారని మండిపడ్డారు. సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పైండ్ల యాకయ్య, అనిల్‌కుమార్, లక్ష్మణ్, నారాయణ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

### స్నానఘట్టాల వద్ద జారిపడిన వృద్ధురాలికి తీవ్రగాయాలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి జాతరకు ఖమ్మం జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన 65 ఏళ్ల వృద్ధురాలు వెంపటి దుర్గమ్మ బుధవారం ఆలయానికి వచ్చారు. కల్యాణ కట్ట సమీపంలోని స్నానఘట్టాల వద్ద కాలు జారీ పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే బందోబస్తులో ఉన్న బ్లూకోల్ట్ కానిస్టేబుల్ రమేశ్, ఎస్‌బీ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, ఇంటిలిజెన్స్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్ వైద్య సేవలందిస్తున్న సిబ్బంది వద్దకు వృద్ధురాలిని తీసుకెళ్లి చికిత్స చేయించారు. పరిస్థితి బాగాలేకపోవడంతో 108లో మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.